# సంభవామి

వడలి రాధాకృష్ణ



రెండు చక్రాల బండి.... లాగుతూనే ఉన్నాడు బికారి.

కదలి పోటుకు ఎరుపెక్కిన ఎర్రనీరెండ బికారిని చుట్టుముట్టి చెమటను ఆవిరుల రూపంలో హరించివేస్తోంది.

లాగుతున్నాడు.... ఊపిరిని బిగబెట్టి ఒక చేతిని రిక్షా హాండిల్ బార్ మీద, మరోచేతిని బండికి కట్టిన టైరు పంజామీద......

మనసును దృష్టిని మమేకం చేసి మరీ లాగుతున్నాడు.రెండు చక్రాల చెక్కరిక్షా... బికారి రెండు కాళ్ళతో కలిపి నాలుగు చక్రాలయ్యాయి.

'ఊహూ...' కదలనని మొరాయిస్తోంది.

ఇసుకలో కూరుకుపోయిన రిక్షాబండి.... మోటుపల్లి రేవు మోటుగా అన్పించింది బికారికి.

నానావిధాల తంటాలు పడుతున్నాడు.

టైర్లు పూర్తిగా ఇసుకలో దిగబడిపోయి ఉన్నాయి. అవడం ఒకప్పుడు పక్కారోడ్డే....

అయినా కెరటాలు తాకే ఇసుక పర్రకీ... రోడ్డుకీ పెద్దతేడా కన్పించడం లేదు అక్కడ.

'లాగరా....!' హుకుం జారీ చేస్తూ అన్నాడు నీలకంఠం.

తన భారీకాయాన్ని సవరించుకున్నాడు. దిగబడిన రిక్షాబండి అటూ ఇటూ కదిలింది.

'దిగబడిపోయింది...' పెద్దగా అనబోయాడు బికారి. కానీ పెద్దగా మాటలు రావడం లేదు. బయటకు తన్నుకొస్తూన్న ఆయాసం అసహనాన్ని కల్గజేస్తోంది.

'రోడ్డు మీద బండి పరుగెత్తాలంటే...' ఏదో చెప్పాలనుకున్నాడు. వాడిని మాట్లాడనీయడంలేదు నీలకంఠం.

'సాగడం లేదంటే టైర్లలో గాలి నిండుకునైనా ఉండాలి.... లేకపోతే లాగేవాడిలో చేవ చచ్చిపోయి ఉండాలి !' నీలకంఠం నోట్లోంచి తన్నుకొచ్చిన చుట్టపొగ బికారిని చుట్టుముడుతూనే ఉంది.

కసుక్కుమని దగ్గాడు. ఫెళఫెళలాడుతూన్న ఆ దగ్గు లోంచి వేయి శబ్దాలు.... పదివేల వేదనలు విన్పిస్తున్నాయి.

నీలకంఠానికి అవన్నీ తెలుసు... వాటిగురించి తానీనాడు ఆలోచించి ఉంటే భుజం మీద బియ్యం మూటలు మోసే మిల్లు మేస్త్రీ స్థాయి నుంచి ఎదిగి ఈనాడు ఈ స్థితికి వచ్చేవాడు కాదు.

'మళ్ళీ సిమెంటు ఎప్పుడు పరుస్తారంట !'

ఫెళ్ళున నవ్వాడు నీలకంఠం... ఆ నవ్వులో దర్పం అగుపిస్తోంది. ఆమోటునవ్వుకి ఇసుకరోడ్డులో ఇరుక్కుపోయిన చక్రాలు ఉలిక్కి పడ్డాయి... ... చక్రాలతోబాటు బికారికూడా....

అవడం సిమెంటు రోడ్డే.... మినిష్టర్ గారు వచ్చి ప్రారంభించాక మూడు నెలలకే కాంట్రాక్టర్ పుణ్యమా అంటూ నలిగి సిమెంటు ప్రక్కకు తొలగిపోవడంతో ఇసుక రాజ్యమేలుతోంది.

తర్వాత వచ్చిన సునామి ఉప్పెన. ఇక చెప్పేదేముంది. రోడ్డూ

పల్లె ఏకమై ఊరు వల్లకాడు అయిపోయింది.

దూరాన సముద్రం మౌనముద్ర దాల్చి ఉంది.

ఎగరలేక అవస్తపడుతూన్న కెరటాలు నిర్వికారంగా అగు పిస్తున్నాయి బికారికి.

'ఏంద్రోయ్ ! అరవైలు దాటావో లేదో అప్పుడే ఆరిపోతన్నావ్! నేను చూడు....' రిక్షానుండి తన భారీకాయాన్ని నేలమీదకు దించుతూ అన్నాడు.

బంగారు రంగు పైజమాను కప్పుకున్న నల్లటి నీలకంఠం శరీరం ఎరుపెక్కిన నీరెండకు నిగనిగలాడుతోంది. అర్థాంత రంగా తగిలించుకున్న చేతి వేళ్ళ బంగారపు ఉంగరాలు వింతగా మెరుస్తున్నాయి.

రిక్షాను కొంచెం నెడతాడేమోనని ఆశగా చూశాడు బికారి. తన మారుతి జెన్‌కారు రిపేరుకు రావడం చికాగ్గానే ఉంది నీలకంఠానికి. ఈ మధ్య తాను చెక్కరిక్షా ఎక్కలేదు. ఇప్పుడు కూర్చొని రావడం నామర్థాగా అన్పిస్తోంది.

కానీ అప్పుడప్పుడు అలా... అలా..

లేకబోతే ఎలక్షన్లు వచ్చిపడుతున్నాయ్. ఎమ్.ఎల్.ఏ సీటు కోసం ప్రయత్నిస్తున్నాడు తను. ఈసారి ఈ నియోజకవర్గం రిజర్వేషన్ కాబోతోంది. తాను ఆవర్గం మనిషి కాక బోయినా ఆ సర్టిఫికెట్ ప్రయత్నిస్తున్నాడు తాను. తనకు ఆ కుల సర్టిఫికెటూ వస్తుంది..... సీటు వస్తుంది. తప్పని సరిగా ఎమ్.ఎల్.ఏ అయి తీరతాడు. ఆ నమ్మకముంది నీలకంఠానికి. అందుకే ఈ బుజ్జగింపులన్నీనూ... వాడిని చేరదీయడం.. వీడిని సేదదీర్చడం... ఎంత నోట్లకట్లని ఎగరేసినా... చీప్‌లిక్కర్ని పారించినా ఈ మధ్య జనాలకి తెలివితేటలు ఎక్కువై పోయాయి.... అందుకే ఈ కళాపోషనంతా....

తనలో తాను గొణుక్కుంటున్నాడు నీలకంఠం.

సముద్రం మీంచి ఎగురుకుంటూ వస్తూన్న చిరుగాలి పవనమొకటి వాతావరణాన్ని కమ్మేస్తోంది.

నెమ్మదిగా గాలి తిరుగుతోంది. అది కూడా బికారిని ఏమీ సేదదీర్చలేకపోతోంది.

'అధికారులెప్పుడొత్తారు బాబయ్యా!' కూరుకుపోయిన రిక్షాని పట్టిలాగుతూనే అన్నాడు.

'మొన్నే కదరా! పదికేజీల బియ్యం దొబ్బావ్ !! కంగారేంటిట... రావాల పంచాల....' ఉప్పెనొచ్చి మేటేసి పోయింది. ఇక బక్కోళ్ళ బతుకు తెలియందేముందట.

'వీరుళ్ళమ్మ దయరా అబ్బాయ్ ! ఆవిడే లేకుంటే సునామీలే గాదు బినామీలు వచ్చి పడతాయ్ !' ఏదో పెద్ద ప్రాస చెప్పాననుకుంటూబిగ్గరగా నవ్వాడు.

ఒళ్ళు కంపరంగా ఉంది బికారికి. కోపం తన్నుకొస్తోంది. వణుకుతూన్న చేతులు లాగుతూన్న రిక్షామీద పట్టుకోల్పోతున్నాయి.

'మనకి పాతిక లక్షలు శాంక్షను అయింది. పంచడానికి చాలదని....మరో పాతిక కావాలని కలెక్టరుగారికి కాయితం పెట్టించి వస్తున్నాను.'

నీలకంఠం కంఠంలోని నీలిభావం అగుపిస్తూనే ఉంది బికారికి. చేతలలోని అవినీతి మాటల్లో కన్పిస్తోంది.

ఆ మనిషిలోని లోపలి మనిషి తనకి ఎరుకే !

'మొన్న వచ్చిన లారీడు బట్టలు స్టీలు సామాగ్రి......'

'వచ్చింది లేవోయ్.... అయినా పంచాంగా ! సిండలారీడు సరుకు ఎన్ని ఊర్లకు పంచాలంట. మన ఊరికని మండలాఫీసరు దగ్గర పట్టుబట్టి తీసుకొచ్చేసరికి ఊపిరి బంగాళాఖాతంలో కల్పినంత పనయింది.'

సునామీ బీభత్సానికి పంపిన సరుకుల వివరాల గురించి పేపర్లో చూడక పోలేదు బికారి.

నీలకంఠానికి చిర్రెత్తుకొస్తోంది. ఆ కోపంతోనే బండిని ఒక్క దుటుకున లాగాడు. ఇసుకలోంచి బయటపడింది. టైరు బండి చక్రాలు ముందుకు కదులుతున్నాయ్ !

అవును..... గొప్పోళ్ళ చేయి పడందే ఏదీ ముందుకు సాగని రోజులివి !

అసలు బీభత్సానికి దెబ్బతినోళ్ళకి పంపినవి ఎవరికి పంచినట్టు.... నీలకంఠం లాంటోళ్ళకి తప్ప.

'నీ గుడిసెకి రెండు వేలు శాంక్షనవుతుంది లేరా !' చెప్పుకుపోతున్నాడు.

తాను ఎన్నో తుఫానులు, వరదలు, బీభత్సాలు చూశాడు. వచ్చినప్పుడల్లా అటువంటి మాటలు వింటూనే ఉన్నాడు.

'తమరి ఇల్లు వచ్చేసింది బాబయ్యా !'

'ఈ రోజు నీ అదృష్టం పండింది.... నీ రిక్షా మీద వచ్చాను....ఫో !' గాడిద బరువు మోసేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది బికారికి.

పొద్దున్నే ఎవరో బట్టలు బిందెలు పంచడానికి వస్తున్నారని పుకారు పుట్టింది.

రిక్షా వేయకుండా ఇంటి గడప వదల్లేదు.

ఏదీ వస్తేగా.....

బోణీ బేరం, ఓ పది పడేస్తాడేమోనని ఆశగా చూశాయి బికారి కళ్ళు.

ఫెళ్ళుమన్న ఓవెకిలి నవ్వు సమాధానమయింది.

నీరసం ఆవహించింది బికారిని.

ఓపిక లేని కాళ్ళని గబుక్కున విరక్కొట్టి, దమ్ముమీద..... కూలిన తన గుడిసె మీద.... పల్లెనడిబొడ్డు మీద... ఆకలిమీద కూలబడ్డాడు. పంచె పొత్తిళ్ళలోంచి బీడి కట్టను బయటకు తీసి ఒక దాన్ని వెలిగించాడు. గుండెల నిండా పొగను నింపుకున్నాడు.

వేలాడుతున్న కాళ్ళని నెమ్మదిగా కూలిన తన ఇంటి అరుగుమీదకు చేర్చాడు. ప్రొద్దున్నుంచీ పదికి పైన సార్లు త్రాగిన నీళ్ళు ఇంకిపోయి ఉన్నాయి. కడుపులో ఖాళీతో ఆడుతున్నాయి. ఇంకా వాటిని ఆకలి తినటం పూర్తి చెయ్యలేదులా ఉంది.

చిన్న ఊరు..... చాలా చితికిపోయి ఉంది. రోడ్డు చాలా దూరం కన్పిస్తోంది. ఆ చివరన నీలకంఠం. మూడంతస్తుల మేడలోని దీపాలు మెరుస్తూ ఉన్నాయి. ఊరంతా పూర్తిగా కొట్టుకుపోయింది. అంతటి నిశీధిలోను ఆ ఇల్లు ఎన్నడూ లేనంతగా ఇంకా మెరుస్తోంది.

ఆ ప్రక్కన దూరంగా సముద్రం మౌనమునిలా ఉంది. చేసిందంతా చేసి, కొంపల్ని కూల్చేసి, తీరంచుట్టూ దండెత్తి ఇప్పుడూ ఏమీ తెలియని ఆరిందలా

అగుపిస్తోంది....

ఆ కెరటాలు చాలా మృదువుగా సాఫీగా ఒడ్డును తాకుతున్నాయి. ప్రక్కనే వీరుళ్ళమ్మ గుడి. ఒకింత మసకచీకటి కమ్మేయడంతో దీనంగా ఉంది.

అన్నీ గమనిస్తూనే ఉన్నాడు బికారి. అరుగు ప్రక్కనే ఉన్న మట్టికుండలోని నీటిని గిరుటు గ్లాసులోకి ఒంపుకుని త్రాగబోయాడు. గుండెల్లోని బీడీ పొగ నోటిలోని నీళ్ళు కలిసి మమేకమై ఫెళఫెళా దగ్గు రూపాన తన్ను కొచ్చింది. తన డబ్బై ఏళ్ళ వయసులో అదేమీ కొత్తకాదు బికారికి.

అమ్మపాలు త్రాగుతున్నప్పుడు వచ్చిన వరద.... అమ్మను కబళించుకుపోయింది.

నాన్నతో కలిసి రిక్షా తొక్కడం నేర్చుకొనే వయసులో వచ్చిన భూకంపం నాన్నను మింగేసింది.

మంచి పరువంలో ఉన్నప్పుడు వచ్చిన తుఫాను కట్టుకున్న దానినే పెకలించిపోయింది.

ఆ తర్వాత జలప్రళయంలో కన్న కొడుకు....

తనకీ.... ఈ ప్రకృతి విలయతాండవానికీ కన్నీటి బాంధవ్యం....

ఒకసారి అతివృష్టి..... అనావృష్టి... ప్రతిసారీ సముద్రం గర్జిస్తూనే ఉంది.

'అన్నీ చల్లని తల్లి ఆ వీరుళ్ళమ్మ చూసు కుంటుంది లేవయ్యా!' ఆనాడు భార్య బక్కమ్మ కోడిని కోస్తూ ఆ తల్లిని వేడుకుంది.

ఉన్నట్టుండి కడుపు కూర్చున్న అరుగు కదిలినట్టనిపించింది. మరో పదినిమిషాలకి ఏదో పెద్ద రొద....కళ్ళముందు అలుక్కు పోతూ... తర్వాత మరే చప్పుడూ వినపళ్ళేదు.

అదేమిటో తెలుసు బికారికి. కాసేపు కళ్ళు మూసుకున్నాడు. అలా కళ్ళు తిరగడం అంత వయసులో మొదటిసారి కాదు తనకు.

ముందు చీకటి... చీకటిగా ఉంటుంది. తర్వాత ఆలోచనాల్లా తెల్లటి గీతల్లా ఆ చీకట్లో పాకుతాయి.... చాలా సార్లు అదేదృశ్యం బికారికి.

ఆ దృశ్యాన నీలకంఠం.... నీలకంఠం లాంటి మరెందరో లీలగా కన్పిస్తూనే ఉంటారు.

ఒకప్పుడు చిరిగిన గుడ్డలతో, చింపిరి జుట్టుతో రోజు గడవడం కష్టమైన దశలో చౌదరిగారి ధాన్యం మిల్లులో బస్తాలు విప్పదీసి మిషన్‌లో వంపి మరోవైపు బియ్యం పట్టే నీలకంఠం నెమ్మదిగా ఊరి పంచాయితీ ప్రెసిడెంట్ ఎలక్షన్లలో పట్టుస్వామి పక్షాన గట్టిగా మద్దతు ప్రకటించి నిలిచాడు.

రిగ్గింగ్ చేసి..... పట్టుస్వామిని ప్రెసిడెంట్ చేశాడు.

స్వామి భక్తిని చాటుకొని.... చౌకడిపో డీలర్‌షిప్‌ను పొంది.... బియ్యంలో రాళ్ళను.... కిరసనాయిలులో నీళ్ళను కలిపి ఊరిప్రజల్ని ఊరికినే మోసం చేసి.... అడిగినవాణ్ణి రాళ్ళతో కొట్టి.... నీటిలో ముంచేవాడు.

దురుసుగా ప్రవర్తించడం, ముడుపులు సెటిల్‌మెంట్లు ప్రతి చిన్న పనికీ బలవంతాన మామూళ్ళు వసూలు చేయడం మామూలై పోయింది. ప్రతీది పారదర్శకమే.

విమర్శలు లెక్క చేయకుండా కమీషన్‌లు దండుకోవడం నీలకంఠానికి నిత్య కృత్యమై పోయింది.

రోజువారీ వసూళ్ళు, పర్సంటేజీలలో పైసా తేడా వచ్చినా తిట్లపురాణం మొదలు పెడతాడు.

బినామీ పేర్లతో భూములు కొనుగోలు చేయడం, తక్షణ సహాయంగా ప్రభుత్వం అందజేసిన మొత్తాల్లో సైతం తలదూర్చి వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకొని మొప్పుపొంది సొమ్ము చేసుకోవడంలో నీలకంఠం బాగా ఆరితేరిన వ్యక్తిగా చెప్పుకోవచ్చు.

తల్చుకుంటే గుండె గుండ్ల కమ్మవాగు అవుతోంది బికారికి. కాని ఏమీ చేయలేని చేతగాని రిక్షా బికారీ తను.

అప్పుడూ ఇప్పుడూ దారిద్ర్యం, దుర దృష్టం తనను నీడలా ఆవహిస్తూనే ఉంది.

ఏళ్ళ తరబడి దారిద్ర్యంతో పాటు తనలో పెరుగుతూన్న చిరాకు ఒళ్ళు విరుచుకొని బయటపడుతుంది. నెమ్మదిగా పెదాలు కదలకుండా కడుపులో ఆకలికి అలికిడి తెలియ కుండా నవ్వుకున్నాడు. ఆనవ్వులో జీవంలేదు.

ఆనాటి సంక్రాంతి సంబరాల్లో వీరుళ్ళమ్మ తిరునాళ్ళలో ఆ తల్లి దేవస్థానానికి తనకి తానే చైర్మన్‌గా ప్రకటించుకున్నాడు.

నీలకంఠం మాటకు ఎదురు లేక పోయింది. కొత్తదేవస్థానం ట్రస్టీ పదవి అతనిలో మరింత స్వేచ్ఛను పెంచింది. అంతవరకు గుడి మాత్రమే మింగేయాలనుకునే తను, గుడిలో లింగాన్ని కూడా మింగేసే స్థాయికి ఎదిగాడు. ఫలితంగా అమ్మవారి మెడలోని ఆభరణాలు మాయం కాబడ్డాయి. గుడిలోని హుండీ నిరంకుశంగా పగలకొట్టబడింది. క్రమంగా ట్రస్టీగా ఉండి ఆలయభూములన్నిటినీ కబ్జా చేసి పారేశాడు.

అన్నీ తెల్సినా ఊరు తెలియనట్టుగానే ఉంది. ఆ ఊరులో అమ్మవారు కూడా అంత ర్భాగమే !

వొంటి మీద బాగా మాసిపోయిన గుడ్డల వాసన తెలుస్తోంది. సునామీ ముంచేసి వెళ్ళిన తర్వాత మిగిలిన తన బోడి ఇంటి గచ్చు గరగర తెలుస్తోంది... అట్టకట్టుకు పోతూన్న జుట్టు బరువు తెలుస్తోంది బికారికి.

చిరాకు... వీటన్నిటికీ చిరాకు, అసహనం....ఆకలికి.... కళ్ళు తెరవటానికి... ఊపిరితియ్యటానికి అన్నిటికీ చిరాకే.... ఏడు పదుల వయసులో అనుభవాల తర్వాత తనకి మిగిలిందదే.....

ఆ చికాకుల దొంతరలో నీలకంఠం రూపం మటుకు నిర్లిప్తమై ఎప్పుడూ వెలుగుతూనే ఉంది.

మొదటిసారి వచ్చిన వరదపుణ్యమా అంటూ నీలకంఠం బాగానే వెనకేసుకున్నాడు. గవర్నమెంటు ఇచ్చిన తక్షణ సహాయాన్ని అందుకొని పొలంపుట్రా ఏర్పరుచుకున్నాడు.

మోటుపల్లి రేవు ప్రాంతంలో వచ్చిన భూకంపం ఎందరి జీవితాలలోనో చీకటి నింపినా..... నీలకంఠానికి నాలుగు ఎకరాల పొలం కొనుక్కునేటట్లు చేసిందని చెప్పొచ్చు.

ఫలితంగా సాదాసీదాగా కన్పించే అతని భార్య కంఠం నగనట్రాతో మెరిసిపోసాగింది.

తుఫాను వచ్చి సర్వం తుడిచి పెట్టుకు పోయినపుడు చిన్నపాటి పాతడాబా స్థానంలో

పక్కా బిల్డింగ్ ఏర్పడింది.

తర్వాత వచ్చిన ప్రతి ఉపద్రవం ఒక్కో అంతస్థునూ, నాలుగేసి ఎకరాల పొలాన్నీ ఏర్పరుస్తూనే ఉంది.

తాజాగా సునామి దెబ్బకి ఊరుమొత్తం నేలమట్టమై పోయింది. జరిగి రెండు నెలలు అయినా ఆ భీభత్సం బికారిని భయభ్రాంతుణ్ణి చేస్తూనే ఉంది,

సునామి పుణ్యమా అంటూ కాస్తో కూస్తో మిగిలి ఉన్న బినామి భూములన్నీ నీలకంఠం కబంధ ఛత్రం క్రిందకు చేరిపోతున్నాయి. ఎందరో ప్రభుత్వ నేతలు, స్వచ్ఛంద సంస్థలు సహాయక కార్యక్రమాల పేరున వచ్చి పోతు న్నారు. వారు చేస్తున్న సహాయాల గురించి పేపర్లలో ఫోటోలతో సహా బాగానే వ్రాస్తున్నారు.

అంతా మాయగా....మరో ప్రపంచంగా అన్పిస్తోంది బికారికి. దూరాన వేగంగా వచ్చి, ఒడ్డును తాకి, చతికిల పడి, ప్రణమిల్లి వెను తిరుగుతున్నాయి సముద్రపు కెరటాలు. ఊరూరా తిరుగుతూ అది చేశాం, ఇది చేస్తున్నాం అంటూ మీటింగులు పెట్టి ప్రకటనలు గుప్పించి వెనక్కి పోతోంది. మొత్తం యంత్రాంగం.

కానీ అసలు నిజం బికారి లాంటి ఎందరో బికారులకు తెలియంది కాదు.

అవును..ఇది జీవనమర్మం... మనుషుల మధ్య అంతర్లీనంగా కనిపించే సహజీవన సూత్రం....

గుళ్ళో వీరుళ్ళమ్మ తల్లి భక్తుల సేవల నందుకుంటూ సంతోషంగా అగుపిస్తూనే ఉంది. బికారిలో ఆకలి...వేదన... అసహనం.

నీలకంఠం ఎదుగుతూనే ఉన్నాడు.

ఎవరోవస్తారని....కొంతైనా ఆదుకుంటా రనే ఓ ఎదురుచూపు.... మనిషిని బ్రతికించే ఓ చిరు ఆశ బికారిలో !

ఉప్పెనలు...తుఫానులు... సునామీలు... మోటుపల్లికి మామూలు విషయాలవుతూనే ఉన్నాయి.

గుళ్ళో దేవత అట్లాగే ఉంది.... నీలకంఠం అలాగే ఉన్నాడు... బికారి ఇలాగే ఉన్నాడు.

ఈ ప్రపంచం ఎప్పుడూ మారదు.

నీలకంఠం 'మరోసునామి' కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు. మరి భగవంతుడు???

అంతు చిక్కని వేయి దాలర్ల ప్రశ్న ఇది!

బికారి అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో తెలియక వీరుళ్ళమ్మ బండలాగే ఉండిపోయింది ఎప్పటిలా !

బికారి ఎదురుచూస్తూనే ఉన్నాడు.

తను,తనకు తోడు ఆకలి... టైరుబండి.. అయినా ఏదో ఉద్ధరింపబడతా నన్న ఆశ ! కాలం పరుగెడుతూనే ఉంది... నిర్లజ్జగా... నిస్సిగ్గుగా... కడలి నదిలా ఉంది... నిర్మలంగా ఉంది. తన కళ్ళతో అప్పుడు చూసిన సముద్ర మేనా ఇది...విస్తుపోతూ అనుకున్నాడు బికారి.

## రాష్ట్ర స్థాయి కవితల పోటీ

ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాఖ్య (యువ సాహితీ వికాస వేదిక ) రాష్ట్ర స్థాయిలో కవితల పోటీ నిర్వహించాలని తలపెట్టింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలలో ఎంపిక చేసిన కవితలకు ప్రసిద్ధ కవులు శ్రీశ్రీ, ఆరుద్ర, పఠాభి స్మారక బహుమతులు అందజేస్తూ కవులను గౌరవించాలని సంకల్పించింది. "సాంఘిక వ్యత్యాసాలు - సామాజిక అణచివేత" ప్రధాన అంశంగా సమకాలీన సామాజిక దృక్పథంతో రాసిన కవితలు పోటీకి పంపవలసి ఉంటుంది. కవిత ప్రతిపై కవి పేరు వివరములు రాయకూడదు. వేరే పేపరులో కవిత సొంతమేనని హామీపత్రము, ఇతర వివరములు రాసి కవితకి జతపరచి పంపాలి. ప్రధాన కార్యదర్శి శ్రీ వి.శిరీష్ కుమార్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాఖ్య, నున్న- 521 212. (వయా) విజయవాడ చిరునామాకు జూలై 30వ తేదీలోగా పంపాలి. వివరములకు 98485 04589 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చు.

# నానీలు

## సోమేపల్లి వెంకటసుబ్బయ్య

తెలుగుతనం
వెల్లివిరుస్తోందా
అయితే
అది జీవమున్న పల్లే.....

యూజ్ అండ్ త్రో
ఈనాటి సంస్కృతి
పురోగమనంలో
వృద్ధాశ్రమాలు

ఎటియం అంటే
ఎంతో ప్రేమ
అచ్చం అలాంటి భార్య కోసమే
అన్వేషణ

అల్లంత దూరాన
కమనీయ దృశ్యం
భూమి ఆకాశం
ముద్దాడుకుంటూనే...

బతికినన్నాళ్ళూ
ఉప్పూ నిప్పూ
సమాధులైనాక మాత్రం
సజీవదహనం

అమ్మా నాన్న
వృద్ధాశ్రమంలో
తల్లిలాంటి భాషకోసమేమో
తెగతాపత్రయం.....!?